క్లుప్తంగా

'గ్రీవెన్స్'తో సమస్యల పరిష్కారం



ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న కె.కె.రాజు

సీతమ్మధార: బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో బుధవారం నెడ్‌క్యాప్ చైర్మన్, ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు గ్రీవెన్స్ కార్యక్రమం నిర్వహించారు. నియోజకవర్గంలోని పలు ప్రాంతాలకు చెందిన ప్రజలు తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆయనకు వినతిపత్రాలు అందజేశారు. వాటిని కె.కె.రాజు పరిశీలించి కొన్నింటిని తక్షణం పరిష్కరించారు. మిగిలిన వినతులను సంబంధిత అధికారులకు పంపి త్వరలోనే పరిష్కరిస్తామని అర్జీదారులకు హామీ ఇచ్చారు. పలువురు నాయకులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

మర్రిపాలెం: కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి గాయపడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాలిలా.. జ్ఞానాపురంలో నివసిస్తున్న బోర శివకుమార్ ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లోని శ్రీకృష్ణ ఇంజినీరింగ్ కంపెనీలో పనిచేస్తున్నాడు. విధి నిర్వహణ నిమిత్తం తండ్రితో కలిసి బైకుపై కంపెనీకి బిర్లా జంక్షన్ సర్వీస్ రోడ్డులో వెళ్తుండగా.. ఎదురుగా వస్తున్న బైకు ఢీకొట్టింది. శివకుమార్ వెనుక కూర్చున్న తండ్రి బోర ఆనందరావు(52) గాయపడ్డారు. పోలీసులు క్షతగాత్రుడిని సమీప ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. సీఐ ఎన్.సాయి పర్యవేక్షణలో హెడ్‌కానిస్టేబుల్ అబద్ధం కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ద్విచక్ర వాహనం ఢీకొని చిన్నారికి..

కంచరపాలెం కొత్తవాడ వీధికి చెందిన సింగూరు వాసుదేవరావుకు ఇద్దరు కుమారులు. చిన్న కుమారుడు జ్ఞానసాగర్(8) ఇంటి నుంచి పాఠశాలకు వెళ్లేందుకు ఆటో ఎక్కడానికి కంచరపాలెం జాతీయ రహదారి దాటుతుండగా.. తాటిచెట్లపాలెం నుంచి ఎన్ఏడీ వైపు వెళుతున్న స్కూటర్ ఢీకొనడంతో గాయపడ్డాడు. పోలీసులు ఫిర్యాదు అందుకుని బాలుడిని సెవెన్‌హిల్స్ ఆస్పత్రికి తరలించారు. సీఐ ఎన్.సాయి పర్యవేక్షణలో ఏఎస్ఐ కనకరాజు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రేషన్ పంపిణీలో ఇబ్బందులు తొలగించండి

సీతంపేట: నెలవారీ రేషన్ పంపిణీలో ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని 25వ వార్డు కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్ కోరారు. వార్డు పరిధిలో రేషన్ పంపిణీలో ఇబ్బందులు వస్తున్నట్టు తన దృష్టికి రావడంతో బుధవారం గణేష్‌నగర్ 131 సచివాలయంలో సమావేశం ఏర్పాటు చేశారు. పౌర సరఫరాల శాఖ ఆర్ఐ మురళీకృష్ణ, సచివాలయ అడ్మిన్లు లక్ష్మణరెడ్డి, హరికృష్ణ, రేషన్ డీలర్లు, వ్యాన్ డ్రైవర్లు, ఆపరేటర్లు, వలంటీర్లు పాల్గొన్నారు.

కవిత్వం.. ఓ జీవనది

సీతంపేట: సహృదయ సాహితి సంస్థ ఆధ్వర్యంలో బుధవారం రాజేంద్రనగర్ ప్రిజం కళాశాలలో ఆంధ్రేతర భారతీయ కవిత్వం, పరిచయం అను అంశంపై డాక్టర్ కె.జి.వేణు ప్రసంగించారు. కవిత్వం ఒక అనుభూతి, ఒక రసానుభూతి అని, కొత్త రూపాలూ సంతరించుకుంటూ, కొత్త రుచులు పంచుకుంటూ ఒక జీవనదిలా సాగిపోతుందన్నారు. నిజాయితీ పరమైన నిబద్ధత కలిగిన కవులు రాసే కవిత్వం గొప్పదిగా నిలుస్తుందని పేర్కొన్నారు. అటువంటి మంచి కవిత్వాన్ని అందించిన ఆంధ్రేతర కవులు సుబోధ్ సర్కార్, మనుష్య పుథిరన్, టి.పి.రాజన్, సీతాకాంత మహాపాత్ర, చాను షర్మిల, అమర్జీత్ చందన్, మందక్రాంత సేన్ తదితరుల గురించి వివరించారు. కార్యక్రమంలో రచయితలు శేఖరమంత్రి ప్రభాకర్, డి.వి.సూర్యారావు, కర్రా ప్రసాదరావు, చిన సూర్యనారాయణ, కొత్తూరి రమణ పాల్గొన్నారు.

తోపుడుబళ్ల తొలగింపు

సీతమ్మధార: ద్వారకా పోలీస్ స్టేషన్ పరిధిలోని సీతంపేట, గురుద్వారా, ద్వారకానగర్ తదితర ప్రాంతాల్లో రోడ్డుకు ఇరువైపులా ఏర్పాటు చేసిన తోపుడుబళ్లను బుధవారం తొలగించారు. గురుద్వారా నుంచి ద్వారకానగర్ వరకు రోడ్డుకిరువైపులా స్టాళ్లు, తోపుడుబళ్లు ఏర్పాటు చేయడం వల్ల ట్రాఫిక్ సమస్యలు ఉత్పన్నమవడంతో ట్రాఫిక్ ఎస్ఐ భాస్కరరావు ఈ చర్యలు చేపట్టారు. దీంతో ట్రాఫిక్ సమస్య కొంత మేరకు తగ్గింది.



భోజనాల కోసం నిర్మించిన ప్రత్యేక రూఫ్ షెడ్



కమ్యూనిటీ హాల్‌లో సమావేశ మందిరం



49వ వార్డు సూర్యానగర్-1లో నిర్మించిన సామాజిక భవనం

చక్కని వేదిక



ఇది కదా అభివృద్ధి

అభివృద్ధికి చిరునామాగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన నిలుస్తోంది. ప్రజల కనీస అవసరాలు తెలుసుకుని ఆ దిశగా అభివృద్ధి పనుల చేయిస్తున్నారు. సుదీర్ఘ కాలంగా మోక్షం లభించని సమస్యలకు పరిష్కారం చూపిస్తున్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో సామాజిక భవనాల నిర్వహణను గాలికొదిలేశారు. వాటిపై దృష్టి సారించిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం.. ప్రజలు శుభకార్యాలు, ఇతర కార్యక్రమాలను ఎటువంటి ఇబ్బందులు లేకుండా జరుపుకునేలా అవసరమైన చోట సామాజిక భవనాలను నిర్మించడం.. శిథిలమైన వాటిని ఆధునికీకరించడం వంటివి చేస్తూ అందరి మన్ననలు పొందుతోంది.

- ఆధునిక హంగులతో సామాజిక భవన నిర్మాణం
- సూర్యానగర్-1 వాసుల 20 ఏళ్ల కల సాకారం
- అభివృద్ధి పనులపై ప్రజల హర్షం

రూ.2 కోట్లతో కల్యాణ మండపం

జీవీఎంసీ 49వ వార్డు ప్రజలందరికీ ఉపయోగపడేలా ప్రగతినగర్‌లో రూ.2 కోట్లతో భారీ కల్యాణ మండపం నిర్మించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. 500 స్క్వేర్ మీటర్స్ స్థలంలో జీ+1 తరహాలో భవనాన్ని నిర్మిస్తారు.

వార్డు నంబర్	సామాజిక భవన ప్రాంతం	నిర్మాణ నిధులు	ప్రయోజనం
49	సూర్యానగర్-1	రూ.27 లక్షలు	4 వేల జనాభా

మురళీనగర్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాల వల్ల జీవీఎంసీ 49వ వార్డు సూర్యానగర్ కాలనీ ప్రజల 20 ఏళ్ల నాటి కల సాకారమైంది. గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో ఈ ప్రాంత వాసులు సామాజిక భవనం నిర్మించాలని ఎన్ని విజ్ఞప్తులు చేసినా వీరి ఆశలు నెరవేరలేదు. సూర్యానగర్‌లో గతంలో శిథిలావస్థకు చేరిన యువజన సేవా సంఘం భవనాన్ని పునర్నిర్మించి సామాజిక భవనంగా ఏర్పాటు చేయాలని స్థానికులు అనేక వినతిపత్రాలు గత ప్రభుత్వంలో అధికారులకు, ప్రజాప్రతినిధులకు అందించారు. ఆ.. చేసేస్తామని హామీ ఇవ్వడమే తప్ప అది కార్యరూపం దాల్చలేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత దీనికి మోక్షం లభించి సూర్యానగర్ చిరకాల వాంఛ నెరవేరి సామాజిక భవనం అందుబాటులోకి వచ్చింది.

వారు కూల్చారు.. జగనన్న నెరవేర్చారు

గత టీడీపీ ప్రభుత్వం సామాజిక భవన నిర్మాణానికి రూ.10 లక్షలు మంజూరు చేస్తానని హామీ ఇచ్చింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో అప్పటి ప్రభుత్వం నిధులు మంజూరు చేసినా.. సకాలంలో పనులు నిర్వహించకపోవడం వల్ల అవి మురిగిపోయి వెనక్కి వెళ్లిపోయాయి. ఆ తర్వాత వచ్చిన అప్పటి ఎమ్మెల్యేకు స్థానికులు అనేక వినతిపత్రాలు అందించారు. శిథిల భవనాన్ని కూల్చడానికి రూ.2 లక్షలు మంజూరు చేసిన మేరకు భవనాన్ని కూల్చేశారు. ఆ తర్వాత సామాజిక భవనం నిర్మాణాన్ని గాలికి వదిలేశారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ హయాంలో కమ్యూనిటీ హాల్ నిర్మాణం పూర్తయి అందుబాటులోకి వచ్చింది.



హ్యాండ్‌వాష్ బేసిన్లు

సకల సదుపాయాలతో భవనం

జీవీఎంసీ ఎన్నికల్లో జగనన్న ప్రభుత్వం ప్రజల ఆకాంక్షలు నెరవేస్తామని హామీ ఇచ్చింది. ఎన్నికల నాటి వాగ్దానాన్ని నిలబెట్టుకునేందుకు ప్రస్తుత కార్పొరేటర్, జీవీఎంసీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ అల్లు శంకరరావు స్థానికుల ఆశలకు అనుగుణంగా పనిచేస్తున్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు సూర్యానగర్‌లో సామాజిక భవనం నిర్మాణానికి జీవీఎంసీ నిధులు రూ.20 లక్షలు మంజూరు చేసి పూర్తి చేశారు. స్థానిక యువజన సంఘం తమ సమావేశాలను నిర్వహించుకోవడమే కాకుండా సూర్యానగర్, సత్యానగర్ తదితర ప్రాంతాల ప్రజలు శుభకార్యక్రమాల నిర్వహణకు అవసరమైన సౌకర్యాలు కల్పించారు. మేడపై భోజనాల నిర్వహణకు రూ.7 లక్షలతో రూఫ్ షెడ్ నిర్మించారు. తాగునీటి సౌకర్యంతోపాటు మరుగుదొడ్డి నిర్మించారు. సుమారు 4 వేల మంది ప్రజలకు ఈ సామాజిక భవనం ప్రయోజకనకరంగా మారింది.



జగనన్నతోనే మురికివాడల అభివృద్ధి

మురికివాడల అభివృద్ధి జగనన్న ప్రభుత్వంలోనే సాధ్యమైంది. మా ప్రాంతంలో అందరూ పేదవారే. ఏదైనా కార్యక్రమాలు చేసుకుందామంటే వేల రూపాయలు వేదిక కోసం ఖర్చు చేయాల్సిన పరిస్థితి. మా ప్రాంతంలో ఎక్కడా సామాజిక భవనాలు లేవు. కార్పొరేటర్ అల్లు శంకరరావుకు విషయం చెప్పగానే మంచి భవనాన్ని నిర్మించి ఇచ్చారు.

– సిహెచ్.శ్యామల, సూర్యానగర్-1

20 ఏళ్ల తర్వాత చూడగలిగాం



మా ప్రాంతంలో అభివృద్ధిని 20 ఏళ్ల తర్వాత చూస్తున్నాం. ప్రతి చోటా రహదారులు, కాలువలు, భవనాలు నిర్మించి అందుబాటులోకి తెచ్చారు. గత ప్రభుత్వాల హయాంలో మా ప్రాంత అభివృద్ధిని పట్టించుకోలేదు. జగనన్న ప్రభుత్వం ఏర్పడిన తర్వాత జీవీఎంసీ నిధులతో సామాజిక భవనం నిర్మించి అందుబాటులోకి తెచ్చారు. థాంక్యూ సీఎం సర్.

– కె.రమణ, సూర్యానగర్-1



స్థానికులకు ఎంతో ప్రయోజనకరం

అన్న మాట నిలబెట్టుకోవడం మా జగనన్న గొప్పతనం. ఇప్పటి వరకు ఏ సీఎం ఇలా ప్రభుత్వ సంక్షేమ పథకాలతోపాటు, అభివృద్ధిని చేయలేదు. ప్రతి ఇంటికి సంక్షేమం అందిస్తున్నారు. ముఖ్యంగా మా ప్రాంతంలో సామాజిక భవనం నిర్మించడం వల్ల సూర్యానగర్-1, సత్యానగర్, మంచుకొండ గార్డెన్స్ ప్రజలకు ఎంతో ప్రయోజనం చేకూరుతుంది.

– ఆర్.వరలక్ష్మి, సత్యానగర్-1

జగనన్నతోనే సంక్షేమం, అభివృద్ధి

- అందుకే మళ్లీ ఆయనే సీఎం కావాలి
- వైఎస్సార్‌సీపీ 'ఉత్తర' సమన్వయకర్త కె.కె.రాజు
- 24, 26, 46, 51 వార్డుల్లో 'వై ఏపీ నీడ్స్ జగన్'



46వ వార్డు సచివాలయంలో పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న కె.కె.రాజు, కటుమూరి సతీష్

కంచరపాలెం: ప్రజా సంక్షేమం, రాష్ట్రాభివృద్ధి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమని, అందుకే మళ్లీ ఆయననే గెలిపించుకుందామని నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు పిలుపునిచ్చారు. 46వ వార్డు కైలాసపురం కస్తూరినగర్-1 సచివాలయం(258) పరిధిలో జీవీఎంసీ డిప్యూటీ మేయర్, పార్టీ మండల అధ్యక్షుడు కటుమూరి సతీష్ ఆధ్వర్యంలో బుధవారం జరిగిన ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే... కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ముందుగా సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరించి, పార్టీ జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా కె.కె.రాజు మాట్లాడుతూ పేదలందరికీ అన్ని సంక్షేమ ఫలాలు అందించాలనే ఉద్దేశంతో సీఎం వైఎస్ జగన్ ఎన్నో వినూత్న కార్యక్రమాలను చేపడుతున్నారన్నారు. కొండవాలు ప్రాంతాల అభివృద్ధికి కృషి చేసిన ఘనత ఆయనకే దక్కుతుందని కొనియాడారు. కార్యక్రమంలో కో-ఆప్షన్ సభ్యుడు అప్పారావు, ఏపీడీ పద్మావతి, కృష్ణ, చిన్నా, లావణ్య, ఈశ్వరరావు, నర్సింగరావు, రామారావు, సచివాలయ సిబ్బంది, కన్వీనర్లు, సీవోలు, ఆర్పీలు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

జగనన్న పాలనలో పేదల కళ్లల్లో ఆనందం

సీతమ్మధార: పేదల కళ్లల్లో ఆనందం చూడాలంటే మళ్లీ జగనన్నే ముఖ్యమంత్రి కావాలని వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు అన్నారు. 24వ వార్డు కార్పొరేటర్ సాడి పద్మారెడ్డి ఆధ్వర్యంలో 1086123 సచివాలయం పరిధి గాంధీనగర్‌లో బుధవారం వై ఏపీ నీడ్స్ జగన్... కార్యక్రమం ప్రారంభమైంది. ముఖ్య అతిథిగా ఆయన సచివాలయంలో ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల వివరాల బోర్డును, అనంతరం పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కె.కె.రాజు మాట్లాడుతూ దేశ చరిత్రలో ఎక్కడా లేని విధంగా హామీలన్నీ అమలు చేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో జేసీఎస్ మండల అధ్యక్షురాలు జి.వి.రమణి, ఏపీడీ దుర్గాప్రసాద్, పద్మావతి, దల్లి రామకృష్ణారెడ్డి, గుడ్ల అశోక్‌రెడ్డి, సీతాకుమారి, గుడ్ల రఘురామిరెడ్డి, బొచ్చు కృష్ణారెడ్డి, చలపతి, బోర రామిరెడ్డి, నక్క ప్రకాష్‌రెడ్డి, చుక్క మధు, చిన్న, ఆశ, కల్పన, రమా, జమున, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



24వ వార్డు సచివాలయంలో సంక్షేమ పథకాల బోర్డును ప్రారంభిస్తున్న కె.కె.రాజు

హామీలు నెరవేర్చిన ఘనత జగనన్నదే..

మర్రిపాలెం: ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదేనని వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు పేర్కొన్నారు. 51వ వార్డు కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ ఆధ్వర్యంలో మాధవధార వుడా కాలనీ వద్ద 1086286 సచివాలయం పరిధిలో ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే... కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆయన సచివాలయం పరిధిలో ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనుల వివరాల డిజిటల్ బోర్డు ఆవిష్కరించి, జెండా ఎగురవేశారు. కన్వీనర్లకు కిట్లు అందజేశారు. కార్పొరేటర్ వెంకటరమణ మాట్లాడుతూ ప్రజలకు పార్టీలకు అతీతంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. కో-ఆప్షన్ సభ్యుడు సేనాపతి అప్పారావు, సీనియర్ మహిళా నేత పేడాడ రమణకుమారి, పార్టీ మండల అధ్యక్షుడు పైడి కృష్ణారావు మాస్టారు, యూసీడీ ఏపీడీ పద్మావతి, కార్పొరేషన్ డైరెక్టర్లు పైడి శ్రీను, దిడ్డి రమేష్, జేసీఎస్ మండల కన్వీనర్లు అమర్‌రెడ్డి, వసంతల అప్పారావు, 51వ వార్డు నాయకులు తిరుమలరావు, మెట్ట దమయంతి, వై.విజయలక్ష్మి, ధర్మావతి, శ్యామ్, రత్నం, లత, పొన్నాడ అప్పారావు మాస్టారు, గణేష్, వినోద్, సాధు, భాను, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు పాల్గొన్నారు.



51వ వార్డులో కన్వీనర్లకు కిట్లు అందజేస్తున్న కె.కె.రాజు



26వ వార్డు డిజిటల్ బోర్డును ఆవిష్కరిస్తున్న పీలా వెంకటలక్ష్మి

జగనన్న వెంటే అందరం ఉందాం

సీతంపేట: జీవీఎంసీ 26వ వార్డు రామకృష్ణానగర్‌లోని 126, 127 సచివాలయాల పరిధిలో ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే... కార్యక్రమం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జి పీలా వెంకటలక్ష్మి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ముందుగా పార్టీ జెండాను ఎగురవేశారు. అనంతరం ఆయా సచివాలయాల పరిధిలో నాలుగున్నరేళ్లలో ప్రభుత్వం చేపట్టిన సంక్షేమం, అభివృద్ధి పనుల డిజిటల్ బోర్డును ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను 99 శాతం అమలు చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వెంట ప్రజలంతా ఉండాలని కోరారు. బులుసు జగదీష్, కన్వీనర్లు శేషు, హరి, సుశీల, నవాబ్, పాండవ శ్రీను, ప్రకాష్, రమాదేవి, లలితకుమారి పాల్గొన్నారు.

గంజాయి రవాణా కట్టడికి విస్తృతంగా తనిఖీలు

సీతమ్మధార: ఫోర్త్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాలతోపాటు రైల్వేస్టేషన్ ఆవరణలో సీఐ ఎస్.విజయకుమార్ ఆధ్వర్యంలో బుధవారం విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. నగర పోలీస్ కమిషనర్ డా.రవిశంకర్ ఆదేశాల మేరకు గంజాయి అక్రమ రవాణాపై తనిఖీలు చేపట్టారు. డాగ్ స్క్వాడ్‌తో అనుమానాస్పదంగా ఉన్న వారి బ్యాగులను చెక్ చేయించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ఇతర రాష్ట్రాల నుంచి విశాఖకు గంజాయి తీసుకొచ్చి రైల్వేస్టేషన్, బస్‌స్టాప్‌లు, కైలాసపురం, తాటిచెట్లపాలెం, దొండపర్తి తదితర ప్రాంతాల నుంచి రైళ్లు, బస్సుల ద్వారా గుట్టుచప్పుడు కాకుండా తరలిస్తున్నట్లు సమాచారంతో తనిఖీలు చేశామని తెలిపారు. గంజాయి రవాణాను అరికడతామన్నారు. పలువురు సిబ్బంది పాల్గొన్నారు.



రైల్వే స్టేషన్ ఆవరణలో బ్యాగు తనిఖీ చేస్తున్న సీఐ విజయకుమార్

విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

తాటిచెట్లపాలెం: పోర్టు హాస్పిటల్ సెక్షన్ పరిధిలోని హెచ్‌టీ లైన్స్ నిర్వహణ పనుల నిమిత్తం డిసెంబర్ 1న విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు జోన్-1 ఆపరేషన్ ఈఈ బి.సింహాచలం నాయుడు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈమేరకు శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు గణేష్‌నగర్, గణేష్ సేవా సంఘం, సత్యసాయినగర్, అండమాన్ నికోబార్ కార్యాలయం, నరసింహనగర్, రైతుబజార్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

మర్రిపాలెం సెక్షన్‌లో..

మురళీనగర్: జోన్-2 డివిజన్ మర్రిపాలెం సెక్షన్ పరిధి గ్రీన్ గార్డెన్స్, మర్రిపాలెం, రైల్వే క్వార్టర్స్ 11కేవీ ఫీడర్లలో నిర్వహణ పనుల కారణంగా శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని జోన్-2 ఈఈ బీకే నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు పార్వతీనగర్, హుస్సేన్‌నగర్, పంజాబ్ హోటల్, గ్రీన్ గార్డెన్స్, సాయినగర్, మహారాణిపేట, గొల్లవీధి, గవర వీధి, రైల్వే క్వార్టర్స్, రాణా ప్రతాప్‌నగర్, శ్రీనివాసనగర్, హుస్సేన్‌నగర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని చెప్పారు.

మురళీనగర్‌లో..

మురళీనగర్ 11కేవీ ఫీడర్లలో నిర్వహణ పనుల కారణంగా శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని జోన్-2 ఈఈ బీకే నాయుడు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు మురళీనగర్, తెన్నేటినగర్, వర్మా కాంప్లెక్స్ ఏరియా, బాలభాను పాఠశాల ఏరియా, బర్మా కాలనీ, వాకర్స్ పార్కు, స్కేటింగ్ పార్కు, స్పెన్సర్స్ షాప్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

ఎస్ఎస్‌టీఎల్ 11 కేవీ పరిధిలో..

మర్రిపాలెం: ఎస్ఎస్‌టీఎల్ 11 కేవీ సబ్‌స్టేషన్ పరిధిలో నిర్వహణ పనుల నిమిత్తం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఈఈ బి.కె.నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు మర్రిపాలెం వుడా కాలనీ, గాంధీనగర్, నేతాజీనగర్, రైతుబజార్, గురజాడ నగర్, జర్నలిస్టుల కాలనీ, పాస్‌పోర్ట్ ఆఫీస్, రిలయన్స్ పెట్రోల్ బంక్, మహాత్మా కాలనీ పార్కు, వంశీనగర్, జీఐఎస్ ఏరియా, వుడా, గంగా గోదావరి, అపార్ట్‌మెంట్లు, అయ్యప్పనగర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని, ప్రజలు గమనించాలని కోరారు.

పేదలకు సహాయం

సీతంపేట: పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజలకు సహాయం అందించేందుకు ఎస్తేర్ రాణి ఫౌండేషన్ స్థాపించినట్లు ఫౌండేషన్ చైర్‌పర్సన్ ఎస్తేర్ రాణి తెలిపారు. ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ 2019లో స్థాపించిన ఫౌండేషన్ ద్వారా గ్రామ, మండల, జిల్లా స్థాయిలో సేవా కార్యక్రమాల ద్వారా పేదలు, వృద్ధులు, అనాథలు, వికలాంగులకు సహాయం అందించామన్నారు. వీటిపై పలువురు ఆకర్షితులై తమతో కలిసి సేవా కార్యక్రమాలు చేపట్టడానికి ముందుకొచ్చారని, వారందరినీ ఫౌండేషన్ కమిటీ జిల్లా, రాష్ట్ర సభ్యులుగా తీసుకున్నామని చెప్పారు. వారంతా తమ తమ ప్రాంతాల్లో సేవా కార్యక్రమాలు చేపడతారన్నారు. కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రతినిధులు సుబ్బారెడ్డి, టి.బాబూరావు, గోవిందరాజు, అబ్రహాం, గౌస్య, కె.శామ్యూల్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్తేర్ రాణి

బౌద్ధాలయంలో సేవా కార్యక్రమాలు

కంచరపాలెం: కంచరపాలెం అశోక్‌నగర్‌లోని బౌద్ధాలయంలో ఆంధ్ర బౌద్ధ కేంద్ర సమాజం ప్రధాన కార్యదర్శి కె.రాజుగణేష్ ఆధ్వర్యంలో బుధవారం ఆంధ్ర-బర్మా బౌద్ధ మహిళా మండలి అధ్యక్షురాలు ఎం.పన్నీరమ్మ 17వ వర్ధంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి కార్పొరేటర్ కె.వి.ఎన్.శశికళ చేతుల మీదుగా పేద మహిళలకు చీరల పంపిణీ, అన్నదానం చేశారు. ముందుగా బుద్ధుడి విగ్రహానికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పన్నీరమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి ఆమె సేవలను కొనియాడారు. ఉచిత కంప్యూటర్ శిక్షణ పూర్తి చేసిన విద్యార్థులకు శశికళ సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో ఎ.ఎం.ఫ్రెడ్డీ, సిహెచ్.బాబూరావు, సూర్యరావు, జి.రాజు, భీమారావు, పి.అప్పారావు, సునీల్ బర్మా క్యాంప్ సభ్యులు పాల్గొన్నారు.



విద్యార్థులకు సర్టిఫికెట్లు అందిస్తున్న అతిథులు